## అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలి : లచ్చిరెడ్డి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీలో చేపడుతున్న రోడ్డు పనులను కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నిట్టు కృష్ణకురుమ, సత్యానారాయణ, వెంకటేష్‌గుప్తా, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

చంపాపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని హనుమాన్‌నగర్‌కాలనీ, భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-1, శ్రీరమణకాలనీ ఫేజ్-1లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ జడ్సీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి జిమ్‌లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గోపీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పార్కుల్లో చిన్నారులకు ప్లే ఏరియా ఏర్పాటు

సైదాబాద్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నారులు నిత్యం ఆటలు ఆడడం కోసం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పార్కుల్లో ప్లే ఏరియాను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ ఏ, సీ కాలనీ పార్కుల్లో ఏర్పాటు చేసిన చిన్నారుల ఆట వస్తువులను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ మేనేజర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ రవి, మహేశ్, కాలనీ ప్రతినిధులు ఎం.ఎస్.చారి, అచ్యుతరావు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

చంపాపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం వివిధ అభివృద్ధి పనులకు ఆలయ ఈఓ ఎస్.లావణ్య దాతలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. దాత ఆకుల ముకేష్ కుమార్ ఆలయంలోని సత్యనారాయణస్వామి వ్రత మండపంలో గ్రానైట్ ఫ్లోరింగ్, దాత గూడూరు సంజయ్ విశ్వనాథ ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్, దాత అంకంగారి సోమలింగం ఆలయంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి పైపులైన్ల ఏర్పాటు, దాత వైశ్రీనివాస్‌రెడ్డి హోమశాలలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులకు అవసరం అయ్యే డబ్బులను వెచ్చించనున్నట్లు ఈఓ తెలిపారు. దాతలకు ధ్యానాంజనేయస్వామి దర్శనం అనంతరం వేద పండితులు, అర్చకుల ఆశీర్వచనం, ఆలయ ఈఓ వారిని శేష వస్త్రాలతో సత్కరించి స్వామి ప్రసాదాలను అందజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌ను స్వదినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం : సీఎం రిలీఫ్ ఫండ్‌ను స్వదినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్, హస్తినాపురం డివిజన్‌లకు చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మధుయాష్కీగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, డివిజన్ అధ్యక్షుడు నర్సింహయాదవ్, సదాశివుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ముగిసిన పారా లీగల్ వలంటీర్ల శిక్షణ తరగతులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు సాగిన పారా లీగల్ వలంటీర్ల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణ తరగతులలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పట్టాభిరామారావు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకెళ్లండి

- అధికారులను ఆదేశించిన నగర కమిషనర్ ఇలంబరిది
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు శాఖలపై సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పీఓలు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో శాఖల ప్రగతిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోటి మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ఉన్నందున నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆ ఆర్థిక సంవత్సరంలో 10,240 స్వయం సహాయక సంఘాలకు రూ.704.67 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 5,016 సంఘాలకు రూ.543.43 కోట్లు పంపిణీ చేసిన నేపథ్యంలో వచ్చే నెలవరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు 7 వేల మహిళా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లను నెలకొల్పేదిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్‌లో రూ.410 కోట్లతో 6 వేల వ్యక్తిగత, వెయ్యి గ్రూప్ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుకు జనవరి 20 నాటికి రుణాలు అందించాలన్నారు. ఇప్పటి వరకు 1,062 కొత్త గ్రూప్‌లను ఏర్పాటు చేసినట్లు అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి తెలిపారు.

### జీహెచ్‌ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలి

గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న జీహెచ్‌ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆస్తులకు సంబంధించి లీజు పూర్తయిన, కొనసాగుతున్న వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీచేయాలన్నారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అనేది పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ సురేష్‌కుమార్, 30 సర్కిళ్ల ప్రాజెక్టు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## 157 మంది పోకిరీల అరెస్ట్

- ధైర్యంగా ఫిర్యాదు చేయండి : ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు పెద్దపీట వేస్తున్నామని, వేధింపుల బారినపడ్డ మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి ఉషా విశ్వనాథ్ అన్నారు. నెల వ్యవధిలో రాచకొండ పరిధిలో మహిళలను పలు రకాలుగా వేధిస్తున్న 157 మందిని ఉమెన్ సేఫ్టీ వింగ్, షీటీమ్స్ అదుపులోకి తీసుకున్నాయన్నారు. పట్టుబడిన వారిలో 84 మంది మేజర్లు, 73 మంది మైనర్లు ఉన్నారని తెలిపారు. తీవ్రతను బట్టి 10 మందిపై క్రిమినల్ కేసులు, 14 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశామని, 139 మంది పోకిరీలకు శుక్రవారం కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఫోన్‌లుచేయడం, సందేశాలు పంపడం, సోషల్ మీడయా యాప్‌ల ద్వారా వేధిస్తున్న కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళకు అసభ్య సందేశాలు పంపుతున్న ర్యాపిడో డ్రైవర్‌పై, దుస్తులు మార్చుకుంటుండగా వీడియోలు తీసి వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్న వ్యక్తిపై, ఓయో రూముకు రావాలని అసభ్య సందేశాలు, ఫోన్‌కాల్స్ చేస్తున్న యువకుడిపై, పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్న వ్యక్తిపై, బస్టాప్‌లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. నెల రోజుల్లో మహిళల చట్టాలు, హక్కులు, నేరాలు జరుగుతున్న తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 125 ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

# ఆదాయం అధికం.. అభివృద్ధి శూన్యం

- మౌలిక సదుపాయాల లేమితో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్


మార్కెట్‌లో స్థలం లేకపోవడంతో బయట వేసిన ఉల్లి బస్తాలు

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్(గంజ్)లో సమస్యలు వెంటాడుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి రైతులకు, మహానగర ప్రజలకు సేవలందిస్తున్న మార్కెట్ సమస్యలతో సతమతమౌతుంది. ప్రభుత్వాలు మారినా పాలకవర్గాలు మారినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆదాయం అధికంగానే ఉన్నా అందుకు అనుగుణంగా అభివృద్ధి చెందడం లేదు. 1980లో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నెలకొల్పిన మార్కెట్‌ను మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేయకపోవడంతో ఇక్కడికి వచ్చే రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


మురుగునీటిలో ఉల్లి గడ్డ బస్తాలు

### భారీ ఎత్తున ఆదాయం..

మార్కెట్‌కు ప్రతి ఏటా కోట్లల్లో ఆదాయం సమకూరుతున్నా అందుకు అనుగుణంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. రైతులు మార్కెట్‌లో తమ పంట అమ్ముకున్నందుకు నూటికి 1శాతం మార్కెట్‌కు చెల్లిస్తారు. అలా చెల్లించిన సొమ్ము గత సంవత్సరం రూ.13కోట్లు వచ్చింది. ఈసారి రూ.15కోట్లు రావాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. ఆదాయం ఏటేటా పెరుగుతూనే ఉంది. అందుకు అనుగుణంగా మార్కెట్‌లో అభివృద్ధి పనులు జరగకపోగా నానాటికి సమస్యలు పెరిగిపోతున్నాయి. మార్కెట్‌కు ప్రతీ రోజు వందలాది వాహనాల్లో మన రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్ నుంచి రైతులు పంటను తెస్తున్నారు. ఉల్లిగడ్డ క్రయవిక్రయాలు సంవత్సరం పొడవునా సాగుతాయి. మిర్చి, చింతపండు, అల్లం, వెల్లుల్లి విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతాయి.

### మార్కెట్‌లో నెలకొన్న సమస్యలు

- మార్కెట్‌లో రైతులకు పంట అమ్ముకునేందుకు నిర్మించిన షెడ్లు సరిపోవడంలేదు. రైతులు ధాన్యాన్ని బయటపెట్టి విక్రయిస్తున్నారు. పూర్వకాలంలో వేసిన మూడు షెడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా శిథిలావస్థకు చేరాయి. పైకప్పు రేకులు తుప్పుపట్టిపోయి వర్షం వచ్చినప్పుడు కురుస్తున్నాయి. రైతులు తెచ్చిన ధాన్యం తడుస్తుంది. కొత్త షెడ్లు నిర్మించాల్సి ఉంది.
- మార్కెట్‌లో డ్రైనేజీ సమస్య వేధిస్తుంది. ప్రతిరోజు ఈ సమస్య నిత్యకృత్యంగా మారింది. మ్యాన్‌హోల్స్ ఎక్కడికక్కడ ధ్వంసం అయి మురుగు నీరు మొత్తం రోడ్లమీదే ప్రవహిస్తుంటుంది. రైతులు మురుగు నీటిలోనే ఉల్లిగడ్డ బస్తాలు వేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.
- ప్రతిరోజు మార్కెట్‌కు వందలాది వాహనాలు వస్తుంటాయి. ఎక్కడికక్కడే ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఉల్లిగడ్డ లోడుతో ప్రతిరోజు 500 లారీలు వస్తుంటాయి. ఇతర వాహనాలు కూడా పెద్దఎత్తున వస్తుండడంతో మార్కెట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.
- అంతర్గత రోడ్ల సమస్య వేధిస్తుంది. నిత్యం వందలాది వాహనాలు ధాన్యం లోడులతో వస్తుండడంతో రోడ్లు మొత్తం పూర్తిగా దెబ్బతిన్నాయి. కంకర తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది. దుమ్ముధూళితో మార్కెట్‌కు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

### ధాన్యానికి రక్షణ లేదు..

రైతులు ధాన్యానికి మార్కెట్‌లో రక్షణలేదు. ధాన్యం బస్తాలు దొంగతనానికి గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. వెనుక వైపు ప్రహరీ లేదు. సెక్యూరిటీ సిబ్బంది ఉండరు. దీంతో ధాన్యానికి రక్షణ లేకుండా పోతుంది.

### నిరుపయోగంగా వేబ్రిడ్జీలు.

రైతుల ధాన్యాన్ని కాంటా వేయాల్సిన వేబ్రిడ్జీలు రెండు నిరుపయోగంగా ఉన్నాయి. మరమ్మతులకు గురై ఏండ్లు గడుస్తున్నా వాటిని రిపేరు చేసే నాథుడే లేరు. దీంతో రైతులు బయట కాంటా వేయించుకోవాల్సి వస్తుంది. మార్కెట్లో సిబ్బంది కొరత వేధిస్తుంది.

### అస్తవ్యస్తంగా విద్యుత్..

మార్కెట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, తీగలు అస్తవ్యస్తంగా మారాయి. పాత కాలం నాటి ఇనుప స్తంభాలు తుప్పుపట్టి వంగిపోయి ఉన్నాయి. విద్యుత్ వ్యవస్థను సరిచేయాల్సి ఉంది. మార్కెట్‌కు రెండేళ్లకు ఒకసారి పాలకవర్గాన్ని ప్రకటిస్తుంది. ప్రభుత్వం పాలకవర్గాలు వస్తున్నాయి పోతున్నాయి. కానీ మార్కెట్‌లో సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదు. ఇటీవలే నూతనంగా వచ్చిన పాలకవర్గంలోనైనా పరిష్కారమవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

# అంబేడ్కర్‌ను కించపరిస్తే సహించేది లేదు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆరాధ్యుడని, ఆయనను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగపేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి హెచ్చరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి బడంగ్‌పేట్‌లో నిర్వహించిన కాగడాల ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత గ్రామ పంచాయతీ కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పారిజాతారెడ్డి మాట్లాడుతూ అమిత్ షా వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, బాలాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు పి.రవికాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి విజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

### అల్మాస్‌గూడలో బీఎస్పీ నిరసన

అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు కేతావత్ బహుగుణనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం అల్మాస్‌గూడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగదని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దిలీప్‌నాయక్, అఖిల్‌నాయక్, యుగేందర్‌నాయక్ పాల్గొన్నారు.


ఎల్బీనగర్ మాల సంఘాల జేఏసీ సభ్యులతో కలిసి అంబేడ్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న బేర బాలకిషన్

### జిల్లెలగూడలో..

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు, టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, సిద్ధేశ్వరాచారి, రమేశ్, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, సుంకయ్య భాస్కర్ పాల్గొన్నారు.

### అమిత్‌షా క్షమాపణ చెప్పాలి : బాలకిషన్

మన్సూరాబాద్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. నిండు పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఎల్బీనగర్ మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు నాలుకల నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి జంగిలి కిషన్, ఉపాధ్యక్షుడు చెంగల్ చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తా వద్ద చేపట్టిన కార్యక్రమానికి బేరా బాలకిషన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులన్నా.. అంబేడ్కర్ అన్నా.. బీజేపీ నేతలకి ఎంతటి కుట్ర ఉందో అమిత్‌షా వ్యాఖ్యలతో తేటతెల్లమైందని, దళితులకు రక్షణ కవచంలా ఉన్న రాజ్యాంగాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ మాల సంఘాల జేఏసీ నాయకులు గంగం శివశంకర్, కట్ట వెంకటేష్, మిద్దెల నర్సింహ, కుమార్, సంతోష్, మల్లేష్, రామకృష్ణ పాల్గొన్నారు.


బడంగ్‌పేట్‌లో యూత్ కాంగ్రెస్ కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి

### ఎన్టీఆర్‌నగర్‌లో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

ఎల్‌బీనగర్ : అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఎన్టీఆర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. వారు మాట్లాడుతూ అమిత్‌షాను తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుబ్బాక శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు తలాటి రమేష్‌నేత, ఎన్ఎస్‌యూఐ శివ, అక్బర్, మహమ్మద్, ప్రేమ్‌నాయక్, మాజీ కౌన్సిలర్ దకియార్‌నాయక్, లింగస్వామిగౌడ్, జగన్నాథం, చంద్రమౌళి పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శనలో చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్


సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పాత పోస్ట్ ఆఫీస్ చౌరస్తా, గాంధీబొమ్మ చౌరస్తాల వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులను కలిసి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పై ఆయా చౌరస్తాలలో పోలీసులను మోహరించాలని కోరారు.

\- ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

## సంత్‌గాడ్గే బాబా ఆశయ సాధనకు కృషి చేయాలి

చంపాపేట : స్వచ్ఛభారత్ పితామహుడు సంత్‌గాడ్గే బాబా ఆశయ సాధన కోసం అందరు కృషిచేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో శుక్రవారం భగత్‌సింగ్ యువజన సంఘం, బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్‌గాడ్గే బాబా వర్ధంతిని పురష్కరించుకొని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్రహ్మయ్య, కొయిలకొండ రమేష్, రజక సంఘం నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

## ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం : వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్ శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈసందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

హయత్‌నగర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సీఐ నాగరాజు గౌడ్ అన్నారు. ఎల్బీనగర్ భాష్యం పాఠశాలకు చెందిన ఏడు బ్రాంచీల విద్యార్థులు మూడు రోజులుగా కుంట్లూర్‌లోని బీఎస్‌ఆర్ క్రికెట్ క్రీడామైదానంలో క్రికెట్ టోర్నమెంటు జరుగుతుంది. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడారు. బహుమతులు ప్రదానం చేశారు.


అయ్యప్పస్వామి మహాపడిపూజలో పాల్గొన్న ప్రణవ్ గ్రూప్ చైర్మన్ బూరుగు రవికుమార్‌గుప్తా తదితరులు

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహాపడిపూజ

చంపాపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కాటం పార్వతమ్మ ఎన్‌క్లేవ్ రోడ్ ఫేజ్-4లోని ప్రణవ్‌ఈస్ట్ క్రెస్ట్‌లో బ్రహ్మశ్రీ డా.చంద్రమౌళి గురుస్వామి ఆశీస్సులతో ఆగమ ప్రతిష్ఠ జ్యోతిష్యశాస్త్ర నిపుణుడు బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేష్ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రణవ్ గ్రూప్ చైర్మన్ బూరుగు రవికుమార్‌గుప్తా ఈడీ బూరుగు రాంబాబు, బండారు అశోక్‌గుప్తా ఆధ్వర్యంలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి అభిషేకం, మహాపడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు బూరుగు విరమల్లయ్యగుప్తా, బూరుగు బాలమల్లయ్యగుప్తా, బూరుగు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా బైకును ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

హయత్‌నగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలకు గురైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామనగర్‌లో నివాసం ఉంటున్న ఎక్కల శ్రీధర్ అనే వ్యక్తి గురువారం రాత్రి 9.20 గంటలకు భాగ్యలత కమాన్ నుంచి సామనగర్ వైపుకు కారును అతివేగంగా నడిపిస్తూ వస్తున్నాడు. శాంతినగర్ వద్దకు రాగానే ఎదురుగా బైకు పైన వస్తున్న సాయి నావిళ్ల(25), మంజూనాథ్(21)లను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు యువకులు కింద పడి తలకు కాళ్లకు బలమైన గాయాలు అయ్యాయి. ఇద్దరు యువకులు అపస్మారకస్థితికి చేరుకున్నారు. ప్రమాదం చేసిన కారు డ్రైవర్ శ్రీధర్ కారును ఆపకుండా మరింత వేగంగా ముందుకు వెళ్తుండగా స్థానిక యువకులు అప్రమత్తమై బైకులతో కారును వెంబడించి కారును ఆపారు. కారును నడిపిస్తున్న శ్రీధర్‌ను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. శ్రీధర్ పూటుగా మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సాయి నావిళ్ల అన్న నాగరాజు ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం తన కారులో పెద్దఅంబర్‌పేట్ వైపుకు వెళ్తూ గండిమైసమ్మ ఆలయం దగ్గర రోడ్డు క్రాస్ చేస్తున్నారు. అదే సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ వైపుకు వెళ్తున్న డీసీఎం కారును వెనుక భాగంలో ఢీకొట్టింది. దాంతో కారు బంపర్ ధ్వంసమైంది. కారులో ఉన్న తహసీల్దార్, డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ప్రమాదంపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

కొత్తపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించడంపై విద్యార్థి దశ నుంచి అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని కిండర్‌ప్లే స్కూల్ నుంచి 40మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కొత్తపేట విజ్ఞాన మాడల్ స్కూల్, వనస్థలిపురం జడ్‌పీహెచ్‌ఎస్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ప్రాంతాల్లో విద్యార్థులకు, సాధారణ ప్రజలకు టీటీఐ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. పార్కు ఆవరణలో హెల్మెట్‌లు పెట్టుకుని పిల్లలు సైకిళ్లపై తిరుగుతూ సందడి చేశారు.

### 11 కార్యక్రమాల్లో 473 మందికి అవగాహన

11 కార్యక్రమాల్లో 473 మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేశారన్నారు. విద్యార్థులకు పార్కు ఆవరణలో గల సైనేజీ బోర్డులను చూపుతూ, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తుచేశారు. రోడ్డు సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. లెక్చర్ హాల్‌లో పిల్లలకు సిగ్నలింగ్ వ్యవస్థపై యానిమేషన్ చిత్రాలను, రైమ్స్ ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో 8 డీడీ కౌన్సెలింగ్ సెషన్స్‌లో 76మంది పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీటీఐ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్, ఎస్‌పీఓ అల్లూరయ్య, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.